
సాక్షి ఒడిశా
శుక్రవారం । 24 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,44,756లు, బంగారం 8.45 గ్రాములు, వెండి 11.1 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



నవీన్-మమత భేటీ

● ముగిసిన మమతా బెనర్జీ రాష్ట్ర పర్యటన

- 8లో.



విద్యుత్ ఛార్జీలు యథాతథం

- 8లో.

న్యూస్‌రీల్

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

భువనేశ్వర్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దారోడ్ రైల్వే డివిజన్ పరిధి ఖుర్దా రోడ్, కైపాదర్ స్టేషన్ల మధ్య ఉన్న తపాంగ్ యార్డులో గురువారం మధ్యాహ్నం 2.25 గంటలకు గూడ్స్‌రైలు పట్టాలు తప్పింది. గూడ్స్‌రైలు క్రాసింగ్‌ను దాటుతుండగా వెనుక ట్రాలీ పట్టాలు తప్పింది. హౌరా-చెన్నై ప్రధాన రైలు మార్గంలో ఈ ప్రమాదం సంభవించడంతో రైలు రవాణా ప్రభావితమైంది. పునరుద్ధరణ పనులు పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో రైలు రవాణా నియంత్రించారు. భువనేశ్వర్-ముంబై సీఎస్ఎంటీ(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, హౌరా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్‌లో.. పాండిచ్చేరి-హౌరా(12868) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కలుపదాఘాట్, చెన్నై-హౌరా మెయిల్(12840) చిలికా, చెన్నై-షాలిమార్(22826) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఖలికోట్, పాండిచ్చేరి-భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బరంపురం రైల్వేస్టేషన్లలో నియంత్రించారు. పూరీ-గుణుపురం(18417) ప్రత్యేక రైలును అక్కడక్కడ నిలుపుదల చేస్తూ ముందుకు నడిపించారు. ఈ ప్రమాదంలో ఆస్తి, ప్రాణహాని లేదని తూర్పుకోస్తా రైల్వే అధికార వర్గాలు స్పష్టం చేశాయి. యాక్సిడెంట్ రిలీఫ్ రైలు తక్షణమే ప్రమాద స్థలానికి చేరి పునరుద్ధరణ కార్యకలాపాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ప్రమాదానికి గురైన గూడ్సు రైలు ముందు భాగాన్ని వేరు చేసి, పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సాయంత్రం 4.50 గంటల నుంచి రైలు రవాణా యథాతథంగా కొనసాగించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

66కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న చిత్రకొండ పోలీసులు ఎస్ఆర్ కూడలి వద్ద 66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. చిత్రకొండ సమితి తటమాస్‌పల్లి గ్రామానికి చెందిన సంతోష్ ఖీలో, మరొకరు మైనర్‌గా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితులను గురువారం మల్కన్‌గిరి కోర్టులో హాజరు పరిచారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.50 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

'అవినీతి నిర్మూలనకు కృషి చేస్తా'

జయపురం: అఖిల భారత భ్రష్టాచార విరోధ ఘటన కొరాపుట్ జిల్లాశాఖ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, నవరంగపూర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ మిశ్రా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర పర్యవేక్షకుడు సుబ్రతకుమార్ నందో ఈ విషయాన్ని వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ ప్రభుత్వ జనకల్యాణ సంక్షేమ పథకాలలో అవినీతిని నిరోధించడంతో పాటు అక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తానని ఈ సందర్భంగా అశోక్ మిశ్రా తెలిపారు. అలాగే అన్ని సమితిలు, తాలుకాల్లో పర్యటించి, కమిటీలు ఏర్పాటు చేస్తానని వివరించారు.

మావోయిస్టు డంప్ స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి లారిగూడ, తైమాల్ గ్రామాల మధ్య ఉన్న అడవిలో 88 బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు గురువారం ఉదయం కూబింగ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు అమర్చిన డంప్ పట్టుబడింది. ఇందులో 3 ఐఈడీ బాంబులు, ఎస్‌బీఎంఎల్ తుపాకులు 2, ఎస్‌బీఎంఎల్ బ్యారెల్ 1, ఎస్‌బీఎంఎల్ ఖాళీ కేసు 1, 36 హెచ్‌ఈ గ్రెనేడ్ 11, నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు 28, వాకీటాకీలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల అణచివేతకు గాను జవాన్లు ఆపరేషన్ ప్రారంభించిన తొలి రోజు భారీ డంప్ పట్టుబడటం పట్ల జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ అభినందనలు తెలియజేశారు.

అంబరాన్నంటిన సంబరాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నెక్కంటి భాస్కరరావు, కమిటీ సభ్యులు

- అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ఘనంగా ఉగాది ఉత్సవాలు
- హాజరైన మంత్రి జగన్నాథ సరక, ఎమ్మెల్యేలు, అధికారులు
- ఆకట్టుకున్న సినీ, టీవీ కళాకారుల ప్రదర్శనలు
- తెలుగు సంఘాల సమన్వయంలో కీలకంగా వ్యవహరించిన నెక్కంటి

రాయగడ: పట్టణంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఒడియా, తెలుగు ప్రజల సమైఖ్యతకు పునాదులుగా నిలిచాయని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జన్నాథ సరక అన్నారు. జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో ఏటా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం, వేలాదిగా జనం తరలి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రాయగడ వంటి ప్రాంతంలో తెలుగు, ఒడియా ప్రజలు సమైఖ్యంగా ఉత్సవాలను జరుపుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు. జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ మాట్లాడుతూ నెక్కంటి ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు.

సమష్టి కృషితోనే..

జిల్లా తెలుగు ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఉగాది వేడుకలకు ఇంతమంది జనం తరలిరావడం తనపై ప్రజలకు ఉన్న అభిమానమేనని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. అందరి సమష్టి కృషితోనే ఉత్సవాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. మన భాషా, సంస్కృతులను పరిరక్షించేందుకు ఇటువంటి తరహా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతా ఐకమత్యంతో ఉంటే కచ్చితంగా అభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారు.



ఉగాది వేడుకలు తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన జనం



వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, పక్కన మంత్రి సరక, నెక్కంటి



జబర్దస్త్ కళాకారుల నవ్వింపులు

ఉసూరుమనిపించిన వర్షం..

పట్టణంలోని మజ్జిగౌరి మందిరం నుంచి ప్రారంభమైన కలశయాత్ర వేదిక వద్దకు చేరుకునే సరికి సాయంత్రం 7గంటలు దాటింది. ఈ యాత్రలో ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ పాల్గొనడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం హోటల్ తేజస్విని మైదానంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. జబర్దస్త్ కళాకారులు రోహిణి, బాబు, ఇమ్మాన్యేల్, రాంప్రసాద్ చేసిన హాస్య ప్రదర్శనలు ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించాయి. సుమారు 2గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమాలు వరుణుడి రాకతో అంతరాయం ఏర్పడింది. వర్షం కురవడంతో చాలామంది ఉసూరుమంటూ ఇళ్లకు పరుగులు పెట్టారు. కొంతమంది మాత్రం వర్షంలోనే తడుచుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.



వేదికపై హుషారెత్తిస్తున్న యాంకర్ అనసూయ

తెలుగు వారి సంక్షేమానికి కృషి..



పంచాంగ పఠనం చేస్తున్న వెంకటరమణ శర్మ, పక్కన బీజేడీ నాయకులు, ఉత్సవ నిర్వాహకులు

జయపురం: రాష్ట్రంలోని తెలుగు ప్రజల సంక్షేమం, వారి పిల్లల విద్యాప్రగతికి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ఎంతో సహకరిస్తున్నారని మాజీమంత్రి రబినారాయణ నందో అన్నారు. జయపుర వేదిక లాన్‌లో నెక్కంటి భాస్కరరావు సహకారంతో తెలుగు సాంస్కృతిక సమితి సభ్యులు నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు అలాగే స్థానిక పురోహితులు వెంకటరమణశర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమంతో ప్రారంభమైన వేడుకలు.. భక్తిశ్రద్ధలతో సాగాయి. అలాగే జబర్దస్త్ కళాకారులు సత్తిపండు, నూకరాజు, శాంతికుమార్ తమ హాస్యరసంతో శ్రోతలను నవ్వుల్లో ముంచెత్తారు. ఇండియన్ ఐడల్‌ఫేమ్ గాయకులు వాగ్దేవి, శ్రీనివాస్, ఓను సింగ్, హర్ష పాడిన పాటలు శ్రోతలను మైమరపింపజేశాయి. పాడుతా తియ్యగా విజేత సార్థక్ ఆలపించిన హుషారైన గీతాలు ఆకట్టుకున్నాయి. అలాగే విశాఖపట్నానికి చెందిన కీర్వాణి ఆర్కెస్ట్రా బృందం, టీ-14లో జయపురం వాసి జగమోహన సాహు అద్భుత ప్రదర్శణలు హైలైట్‌గా నిలిచాయి. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, బీజేడీ నాయకులు ఇందిరా నందో, బీజేడీ నాయకులు, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రథ్, బి.బాలంకిరావు, బి.సతీష్, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్ విష్ణువర్ధనరెడ్డి, టీఎస్ఎస్ అధ్యక్షుడు ధీరేష్ పట్నాయక్, శశి పట్నాయక్, డి.మాధవ, సుధాకర పట్నాయక్, డి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో..

పట్టణంలోని నెహ్రూనగర్‌లో తెలుగు కుటుంబాలు అంతా ఉమ్మడిగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఒడియా ప్రజలు, చిన్నారులు, మహిళల మధ్య వివిధ పోటీలు నిర్వహించారు. లెమన్ స్పూన్, స్లో సైకిలింగ్, సైకిల్ రన్నింగ్, మ్యూజికల్ చైర్, డ్యాన్స్ పోటీలు జరిగాయి అలాగే చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త కాంతారావు, సభ్యులు రమణ, పూర్ణరావు, మిల్లు యజమాని గోవిందరావు తదితరులు సహకరించారు.



పాటలతో ఉర్రూతలూగిస్తున్న గాయకులు వాగ్దేవి, శ్రీనివాస్



మ్యూజికల్ చైర్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

ఐదేళ్ల అనంతరం..



నవరంగ్‌పూర్‌లో కార్యక్రమాలు తిలకిస్తున్న ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యే రంధారి, కలెక్టర్

కొరాపుట్: జిల్లా కేంద్రంలో తొలిసారిగా ఉగాది వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, సునాబెడా మున్సిపల్ చైర్మన్ రంజన్‌కుమార్ పాత్రొ, జిల్లా ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి పాల్గొన్నారు. నవరంగ్‌పూర్ పట్టణంలో దాదాపు ఐదేళ్ల అనంతరం వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై, వైద్య రంగంలో సేవలందించిన కె.ధనుంజయ్ పట్నాయక్, సత్యసాయి సమితి కన్వీనర్ పి.లింగమూర్తిని సత్కరించారు. ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, నవరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్, మాజీ చైర్మన్ ప్రహ్లాద త్రిపాఠి, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు మంజులా మాఝి, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి ప్రేక్షకుల మధ్య నుంచే కార్యక్రమాలను తిలకించారు. అకస్మాతుగా భారీ వర్షం కురవడంతో కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది.



కొరాపుట్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, ఎమ్మెల్యే పాడాల్, చంద్రశేఖర్



సునాబెడాలో ఉగాది వేడుకలు

శాంతమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

బరంపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన మాబుడి శాంతమ్మ సంబరాలు ఏప్రిల్ 4న అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక దేశీ బెహరా వీధిలో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక ఆలయ నిర్మాణం పూర్తి చేశరు. మరోవైపు బరంపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్ దేశీబెహరా బృందంతో సబ్ కలెక్టర్ కులకర్ణి అసుతోష్‌తో గురువారం సమావేశమయ్యారు. సంబరాల ఏర్పాట్లపై చర్చలు జరిపారు. ఏప్రిల్ 4న అర్ధరాత్రి సమయంలో దేశీబెహరా ఇంటి నుంచి కమిటీ బయలుదేరి, తిరిగి అమ్మవారిని గర్భగుడి నుంచి దేశీబెహర వీధిలోని తాత్కాలిక ఆలయానికి చేర్చేందుకు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపారు. అమ్మవారు పట్టణంలోకి వచ్చే సమయంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని వివిధ కూడళ్లలో జరిగే భా రథాలు, కొళాకుంజలు వద్ద ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. మే 1వరకు ఈ సంబరాలు కొనసాగనున్నాయని వివరించారు.



మాబుడి శాంతమ్మ



సంబరాలపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కులకర్ణి అసుతోష్

కమలానికి కొత్త సారథి

- బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా మన్మోహన్ సామల్
- మూడోసారి పార్టీ పగ్గాలు అప్పగించిన అధిష్టానం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడు నియమితులయ్యారు. సీనియర్ నాయకుడు, మాజీమంత్రి మన్మోహన్ సామల్‌ను నియమిస్తున్నట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యాలయ వర్గాలు గురువారం ప్రకటించాయి. రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా సామల్ నియమితులు కావడం ఇది మూడోసారి కావడం విశేషం. 64 ఏళ్ల ఆయన.. సంస్థాగత నైపుణ్యత లక్షణాలతో సంక్లిష్ట పరిస్థితులను అవలీలగా అధిగమించే నాయకుడిగా పేరొందారు. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఈ నియామకం అత్యంత కీలకంగా రాజకీయ శిబిరాల్లో చర్చ సాగుతోంది. కీలకమైన పరిస్థితుల్లో గట్టి నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టిన కేంద్ర నాయకత్వానికి సామల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని, వారి కోరికను నెరవేర్చేందుకు అంతా సమష్టి కృషి, నాయకత్వం, నిర్ణయంతో ముందడుగు వేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో శక్తిమేరకు పోరాడి, ప్రజాభీష్టంతో బీజేపీ అధికారంలో ప్రభుత్వాన్ని తీసుకు వస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమీర్ మహంతి మూడేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో కొత్త అధ్యక్షుడిని నియమించినట్లు పార్టీ నాయకుడు, రెంగాలి ఎమ్మెల్యే నౌరీ నాయక్ తెలిపారు. ఆయన నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో ధీటైన పోటీతో ఘన విజయం సాధిస్తామనే నమ్మకం ఉందని బీజేపీ ఎమ్మెల్యే సుభాష్ పాణిగ్రాహి అన్నారు.



మన్మోహన్ సామల్

- గత ఏడాది నవంబర్‌లో జరిగిన ధామ్‌నగర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పార్టీ విజయంలో సామల్ కీలక పాత్రధారిగా గుర్తింపు పొందారు.
- కోస్తా జిల్లా భద్రక్ నుంచి 2004లో ఒడిశా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.
- బీజేడీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో 2008 వరకు రెవెన్యూ, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.
- పదవీ కాలంలో పలు శాసనసభ కమిటీలకు అధ్యక్షుడిగా, సభ్యుడిగా నియమితులై, పనితీరును చాటుకున్నారు.
- ఈ వ్యవధిలో బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు.

క్లుప్తంగా

శ్రీరామనవమి కల్యాణానికి పవిత్ర గోటి తలంబ్రాలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈ నెల 30న జరగబోయే శ్రీరామనవమి కల్యాణానికి గోటితో తొలచిన కోటి తలంబ్రాలు సిద్ధమయ్యాయి. రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో సిద్ధం చేసిన గోటి తలంబ్రాలను 2017 నుంచి శ్రీరాముడి కల్యాణానికి అర్చకులు వినియోగిస్తున్నారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు ప్రత్యేకంగా సేద్యం చేసిన ధాన్యాన్ని గోటితో తొలిచి తలంబ్రాలుగా మార్చారు. సిద్ధం చేసిన తలంబ్రాలను రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులకు రామ భక్తులు పంపించారు. పవిత్ర తలంబ్రాలను శ్రీరామనవమి రోజున నిర్వహించబోయే స్వామి కల్యాణంలో తలంబ్రాల సేవకు అర్చకులు వినియోగిస్తారని విజయ్‌కుమార్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6, ఇంటర్‌లో ప్రవేశం కోసం, అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 2023 - 24 విద్యా సంవత్సరానికి గానూ ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. అనాథలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును హెచ్ టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్ సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన సందేహాలు ఏమైనా ఉంటే 90002 04925 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రజా భాగస్వామ్యంతోనే క్షయ నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామేశ్వరి ప్రభు

విజయనగరం ఫోర్ట్: ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ వ్యాధిని నియంత్రించడం సాధ్యపడుతుందని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు అన్నారు. జిల్లా క్షయ నివారణ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు తదితర చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించామని చెప్పారు. 2025 నాటికి క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తీసుకుంటున్న చర్యలు ఫలితంగా జిల్లాలో క్షయ వ్యాధి వ్యాప్తి తగ్గుతుందన్నారు. జిల్లాలో గత నాలుగేళ్లుగా క్షయ వ్యాధి 20 శాతం మేర తగ్గిందన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఒక నోడల్ అధికారిని, అవసరమైన మేరకు మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు. క్షయ రోగుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నామని తెలిపారు. 64 మంది క్షయ మిత్రల సహాయంతో 518 క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నామని తెలిపారు. వారికి మందులు, ఉచిత ఆహార కిట్లను అందిస్తున్నామన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం పట్టణంలో అవగాహన ర్యాలీతో పాటు సంతపేట యూపీహెచ్‌సీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస పత్రాలను అందజేస్తామన్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై దుర్గగుడి సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెదుగు పంచాయతీ పర్తాపురం గ్రామానికి చెందిన గన్నేలబోయిన గుండు, సన్యాసి, చంద్రమ్మ, సోను అనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బుధవారం ఆటోలో పాచిపెంటలో జరిగిన నూకాలమ్మ జాతరకు వచ్చి తిరిగి పర్తాపురం వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 సహాయంతో వారిని సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో గన్నేలబోయిన గుండు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామంలో కుక్కలు దాడిచేయడంతో గ్రామానికి చెందిన తాడేల ఈశ్వరమ్మ గాయాలపాలైంది. గురువారం వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న ఆమెపై ఒక్కసారిగా కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో ఆమె కాలికి గాయం కావడాన్ని స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టిన అనంతరం ఆమెను ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు.



మమత బెనర్జీకి పూరీ జగన్నాథుని శేషవస్త్రాన్ని అందిస్తున్న సీఎం నవీన్



నవీన్ పట్నాయక్‌కు బిశ్వ బంగ్లా శాలువా బహూకరిస్తున్న మమతా బెనర్జీ



బిజూ పట్నాయక్, జ్ఞాన్ పట్నాయక్ చిత్ర పటాలకు నివాళులర్పించిన మమత



మమత బెనర్జీకి నవీన్ బహూకరించిన జగన్నాథుని బుల్లి రథాలు

నవీన్–మమత భేటీ

- ముగిసిన మమతా బెనర్జీ రాష్ట్ర పర్యటన

భువనేశ్వర్: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ 3 రోజుల రాష్ట్ర పర్యటన గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నవీన్ నివాస్ సందర్శించి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో భేటీ అయ్యారు. వీరివురి భేటీ పట్ల రాజకీయ చర్చ ఊపందుకుంది. అయితే ఈ భేటీ సౌజన్యాత్మకమని ఇరువురు ముఖ్యమంత్రులు ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మమత.. నవీన్‌ను అగ్రశ్రేణి నాయకుడని కొనియాడారు. 3 రోజుల పర్యటనలో అత్యంత ఆత్మీయత, అనురాగాలతో చక్కటి ఆతిథ్యం కల్పించారని సంతృప్తి వ్యక్తంచేశారు. భారతదేశ సమాఖ్య(ఫెడరలిజం) వ్యవస్థ శాశ్వతంగా, బలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ భేటీ సౌజన్యాత్మకం కావడంతో రాజకీయ విషయాలపై లోతైన చర్చ జరగలేదని తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ అధినేత్రి తెలిపారు. పటిష్టమైన సురక్షిత సమాఖ్య ఆవిష్కరణలో నవీన్‌కు ఎల్లప్పుడూ తనవంతు మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రస్తుతం ఎటువంటి రాజకీయ ప్రశ్నలకు బదులు ఇచ్చేది లేదన్నారు. ఒంటరిగా ఉన్నప్పుడు రాజకీయ ప్రశ్నల గురించి నన్ను అడిగితే ప్రశ్నలన్నింటికీ బంగారు లాంటి సమాధానం ఇస్తానని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్థానిక మీడియాను చమత్కరించి దాట వేశారు.

నదీజలాల జగడం

- మహానది జల వివాదంపై శాసనసభలో రభస
- రోజంతా కార్యక్రమాలకు గండి



స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్షాల సభ్యులు


భువనేశ్వర్: మహానది జలాల వివాదంపై చర్చతో గురువారం జరిగిన సభా సమావేశాల్లో తీవ్ర అలజడి చోటు చేసుకుంది. ప్రధాన విపక్షం భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ పార్టీ సభ్యుల దాడితో అసెంబ్లీలో గందరగోళ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దీంతో రోజంతా సభా కార్యక్రమాలకు గండి పడింది. సభా సమావేశాలు ఆరంభం కావడంతో ప్రతిపక్ష సభ్యులు మహానది జలాల వివాదం అంశాన్ని లేవనెత్తారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ నాయకుడు(సీఎల్పీ) నర్సింగ మిశ్రా ప్రశ్నోత్తరాల సమయాన్ని నిలిపివేసి మహానది నది నీటిపై చర్చకు డిమాండ్ చేశారు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు బ్యారేజీలు నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో మహానది జలాల నిల్వ అడుగంటి పోయిందన్నారు. ఈ పరిస్థితికి ఉభయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణమని నర్సింగ మిశ్రా విరుచుకు పడ్డారు. అలాగే మహానదికి సంబంధించిన అన్ని సమస్యలపై చర్చ జరపాలని బీజేపీ సభ్యులు కోరారు. సమస్య పరిష్కారానికి ఒడిశా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహా సమగ్ర కార్యాచరణని సభలో ప్రవేశ పెట్టాలని పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని తాత్కాలికంగా నిలిపివేసి ప్రత్యేక తీర్మానం ద్వారా మహానది అంశంపై చర్చించాలని కోరారు. వీరి డిమాండ్ పట్ల స్పీకర్ స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తంచేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో విపక్షాల సభ్యులు పోడియం ప్రాంగణానికి దూసుకు వెళ్లారు. ఈ పరిస్థితుల దృష్ట్యా స్పీకర్ బిక్రమ్‌కేశరి అరూఖ్ సభను వాయిదా వేశారు.

చర్చకు అడగాల్సింది..!

మహానది జలాల వివాదంపై అధికార పార్టీ అసెంబ్లీలో గలాటా సృష్టించింది. ప్రశ్నోత్తరాలను మినహాయించి ఈ అంశంపై చర్చకు అభ్యర్థిస్తే అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సీఎల్పీ నాయకుడు నర్సింగ మిశ్రా వ్యాఖ్యానించారు. జలాల పంపిణీ వివాదం పరిష్కరించే సత్తాలేని బలహీన పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం ఊగిసలాడుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో సభలో చర్చకు అనుమతిస్తే ప్రభుత్వ బండారం బయట పడుతుందని వెనుకంజ వేస్తుందని దుయ్యబట్టారు. అయితే విపక్షాలు లేవనెత్తిన మహానది జలాల పంపిణీ వివాదంపై సభలో చర్చకు ప్రభుత్వం సుముఖంగానే వ్యవహరిస్తుందని అధికార పక్షం సభ్యుడు మాజీమంత్రి ప్రతాప్ జెనా సభ వెలుపల విలేకరులకు తెలిపారు. విపక్షాల అభ్యర్థన మేరకు జలాల పంపిణీ వివాదంపై సభలో వివరణ ప్రవేశ పెట్టాలని జలవనరుల శాఖ మంత్రికి స్పీకర్ ఆదేశించారని తెలిపారు. ప్రశ్నోత్తరాలకు అంతరాయం లేకుండా వాయిదా తీర్మానం ప్రతిపాదనతో ప్రతిపక్షాలు చర్చకు డిమాండ్ చేయాల్సిందని ఆయన హితవు పలికారు.

విద్యుత్ ఛార్జీలు యథాతథం

- అపరాధ రుసుం రద్దు
- ఆన్‌లైన్ బిల్లు చెల్లింపులకు అదనపు రాయితీ



భువనేశ్వర్: కొత్త ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఓఈఆర్‌సీ) గురువారం ప్రకటించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని రిటైల్ వినియోగదారులకు విద్యుత్ టారిఫ్ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. రిటైల్ విద్యుత్ సరఫరా టారిఫ్‌లో ఎలాంటి మార్పు ఉండదని ఓఈఆర్‌సీ కార్యదర్శి ప్రియబ్రత పట్నాయక్ తెలిపారు. మరోవైపు వినియోగదారులకు పలు రాయితీలు కల్పించారు. గ్రామీణంలో ట్రాన్స్‌మిషన్(ఎల్‌టీ) సకాలంలో బిల్లు చెల్లించే సక్రమ విద్యుత్ వినియోగదారులకు వినియోగదారులకు ప్రస్తుతం ఉన్న రాయితీకి యూనిట్‌కు 10 పైసలు చొప్పున అదనపు రాయితీ లభిస్తుందని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో 95లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ప్రయోజనం చేకూరనుందన్నారు. ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లు చెల్లించే ఎల్‌టీ డొమెస్టిక్, సింగిల్–ఫేజ్ జనరల్ పర్పస్ కేటగిరీ వినియోగదారులకు కల్పిస్తున్న 3శాతం రాయితీని 4శాతానికి విస్తరించారు.

యూనిట్ ఛార్జీలు..

సాధారణ వినియోగదారులకు మొదటి 50 యూనిట్లకు యూనిట్‌కు రూ.3.50లు నుంచి 200 యూనిట్ల మధ్య వినియోగానికి యూనిట్‌కు రూ.4.80లు, 200–400 మధ్య వినియోగానికి యూనిట్‌కు రూ.5.80, 400 యూనిట్ల పైబడిన వారికి యూనిట్‌కు రూ.6.20 ఛార్జీ వసూలు చేస్తారు. బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే వసూలు చేస్తున్న అదనపు రుసుం మినహాయించినట్లు ప్రకటించారు. కొత్త సంవత్సరం నుంచి సాధారణ వినియోగదారులకు అపరాధ రుసుం భారం తొలగిపోతున్నారు. వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక కార్యకలాపాల(శీతల నిల్వ) సుంకం హెచ్‌టీ, ఎల్‌టీలో యూనిట్‌కు రూ.1.60 పైసలు తగ్గించారు. గతంలో ఈ వర్గాలు క్రమంగా యూనిట్‌కు రూ.4.60, రూ.4.70 ఛార్జీ చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో పగటిపూట మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, అర్ధరాత్రి 12 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఆఫ్ పీక్ అవర్స్‌గా ప్రకటించారు. గతంలో ఇది అర్ధరాత్రి 12 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు మాత్రమే ఉండేది. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉత్పాదన కొనసాగుతోంది. దీంతో సాధారణ వినియోగదారునిపై ఛార్జీల మోత నివారించడం అనివార్యమని పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు, ఇతర వర్గాల వాటాదారులందరి వాదనలను విన్న తర్వాత కమిషన్ విద్యుత్ ఛార్జీల ఎటువంటి మార్పు లేదని ఉత్తర్వులను జారీ చేసింది.

ప్రమాదంలో అన్నాచెల్లెళ్ల మృతి

- మూడంతస్తుల భవనం కూలిపోవడంతో ప్రమాదం



అంజలి మృతదేహం

మెరకముడిదాం: జిల్లాలోని మెరకముడిదాం మండలం గొల్లమ్రివలస గ్రామానికి చెందిన సాకేటి దుర్గాప్రసాద్, అంజలిలు మూడంతస్తుల భవనం కుప్పకూలిన సంఘటనలో విశాఖపట్నంలో బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామారావు, కల్యాణి దంపతులు, వారి పిల్లలు దుర్గాప్రసాద్, కల్యాణిలతో కలిసి 11 ఏళ్ల క్రితం వలస వెళ్లి విశాఖపట్నంలో ఉంటున్నారు. రామారావు డాబర్ కంపెనీలో పనిచేస్తుండగా, కల్యాణి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తోంది. కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటర్మీడియెట్, కుమార్తె అంజలి 10వ తరగతి చదువుతున్నారు. ఈ కుటుంబం నివాసముంటున్న భవనం అర్ధరాత్రి కుప్పకూలడంతో దుర్గాప్రసాద్, అంజలి అక్కడికక్కడే మృతి చెందారు. రామారావు, కల్యాణి తీవ్రంగా గాయపడడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ వార్త తెలుసుకున్న గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. బాధితుల బంధువులు బుధవారం వేకువజామున విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు.

నాక్ అక్రిడేషన్ తప్పనిసరి

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని ప్రతి ఉన్నత విద్యా కళాశాల నాక్ అక్రిడేషన్ స్థాయిని చేరుకోవాలని ఆ దిశగా కళాశాలలను తీర్చిదిద్దాలని ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు అన్నారు. స్థానిక జెఎన్‌టీయూ గురుజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో గురువారం యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు నిర్వహించిన 'నాక్ అక్రిడేషన్' సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుకున్న లక్ష్య సాధనలో భాగంగా తొలిత ప్రతి కళాశాల నాక్ అక్రిడేషన్ అర్హతను సాధించే దిశగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలలకు అన్ని సౌకర్యాలు మరియు కావాల్సిన క్వాలిటీ ప్రమాణాలను సమకూర్చుకోవాలని 2021 ఫిబ్రవరిలోనే మూడేళ్ల పాటు సమయం ఇస్తూ జీఓ ఇచ్చారని అన్నారు. నాక్ అక్రిడేషన్ అర్హత సాధించడం వల్ల విద్యా సంస్థలకు ప్రపంచ స్థాయి గుర్తింపు రావటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దండిగా మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 నెలల ఇంటర్న్‌షిప్, నాక్ అక్రిడేషన్ వల్ల విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందడానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు.

మామిడి రైతులకు తీపి కబురు



మామిడి దిగుబడులు ఒకే చోటకు చేర్చి ధర వచ్చేటప్పుడు విక్రయించుకునేలా చేసేందుకు మామిడి సేకరణ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఇప్పటికే నాలుగు చోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి. 16 నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి ద్వారా ఉద్యానవన పంటల రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది.

- జిల్లాలో 20 మామిడి సేకరణ కేంద్రాలు
- ఒక్కో కేంద్రానికి రూ.15లక్షలు
- రూ.11.25 లక్షల ప్రభుత్వం రాయితీ
- రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యం
- దళారీ వ్యవస్థకు చెక్



విక్రయాలకు సిద్ధంగా ఉన్న మామిడి బుట్టలు, (ఇన్‌సెట్లో) లొట్టపల్లిలో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రం

జామి: ఉద్యానవన పంటలు పండించే రైతులకు ప్రయోజనం చేకూర్చడంతో పాటు దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాయితీల వరాలు కురిపించి ఉద్యానవన రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా మామిడి రైతులను ఆదుకునే విధంగా మామిడి సేకరణ కేంద్రాల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మామిడి రైతులు దళారీల బారిన పడకుండా రైతులకు నష్టం వాటిల్లకుండా ఈ సెంటర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ రాయితీ రూ.11.25 లక్షలు

జిల్లాలో ప్రభుత్వం 20 మామిడి సేకరణ కేంద్రాలు మంజూరు చేసింది. వాటిలో నాలుగు కేంద్రాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో 16 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో ఎంసీసీ నిర్మాణానికి రూ.15 లక్షల వ్యయం కానుంది. ఇందులో ప్రభుత్వం రాయితీ రూ.11.25 లక్షలు మంజూరు చేస్తుంది. ఎఫ్‌పీఓ వాటా రూ.3.75 లక్షలు మామిడి రైతులు చెల్లించాలి. మామిడి రైతులు ఉద్యానవన శాఖ ద్వారా గుర్తింపు పత్రం తీసుకుని, 100మంది రైతులు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు కావాలి. అటువంటి ఒక సంఘానికి ఒక ఎంసీసీ మంజూరు చేస్తారు.

ఎంసీసీలతో ప్రయోజనాలు

రైతులు, కౌలు రైతులు తాము పండించిన పంటను ఎంసీసీల వద్దకు తరలించి, నిల్వ చేసుకుని మామిడి అమ్మకాలు సాగించవచ్చు. రైతులు తమ పంటను ఒకే కేంద్రం వద్దకు తరలిస్తే ముఖ్యంగా రైతులకు మంచి ధర వస్తుంది, కేంద్రం వద్ద గ్రేడ్‌లు వారీగా విభజించి గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా విక్రయాలు జరపవచ్చు. గతంలో రైతులు సొంతంగా అమ్మకాలు సాగిస్తే దళారులు తమకు నచ్చిన ధరకు తీసుకునే వారు. దీంతో మామిడి రైతులు నష్టపోయేవారు. ఎంసీసీల ద్వారా అమ్మకాలు సాగిస్తే అందరికి ఒకే రకమైన ధర వస్తుంది. ముఖ్యంగా దళారుల బెడద ఉండదు. మామిడి పంటనే కాక ఉద్యానవన పంటలు, కూరగాయలు కూడా అమ్మకాలు చేయవచ్చు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఎంసీసీల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా దళారులను నియంత్రించడానికి ఈ సేకరణ కేంద్రాలు ఉపకరిస్తాయి.

రెండు జిల్లాల రైతులకు..

లొట్టపల్లి పంచాయతీలో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రం విజయగనరం, విశాఖ జిల్లాలకు చెందిన సుమారు ఐదు వేల మంది మామిడి రైతులు వినియోగించుకోనున్నారు. విజయగనరం జిల్లాలో జామి, ఎస్.కోట, కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, గంట్యాడ, విజయగనరం తదితర మండలాలు, విశాఖపట్నం జిల్లాకు చెందిన పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి, కోటపాడు తదితర మండలాలకు చెందిన రైతులకు లొట్టపల్లిలోని మామిడి సేకరణ కేంద్రం వినియోగపడనుంది.

30,720 హెక్టార్లలో సాగు

జిల్లాలో మామిడి పంటను 30,720 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వం ఉద్యానవన శాఖకు అందిస్తున్న ప్రోత్సాహంతో సుమారు 400 హెక్టార్లలో మామిడి సాగును విస్తరించారు. జిల్లాలో ఏడాదికి సరాసరి 3,07,200 మెట్రిక్ టన్నులు మామిడి దిగుబడులు సాధిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పండించిన మామిడి ఉత్పత్తులు రాయపూర్, బరంపురం, కోల్‌కత్తా, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.


రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మామిడి సేకరణ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు ఇది ఉపయోగకరం. ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్మాణాలకు 75శాతం రాయితీ అందిస్తుంది. ఒక్క మామిడి కాకుండా ఇతరత్రా ఉద్యానవన పంటలను కూడా విక్రయించుకోవచ్చు. రైతులు పండించిన పంటను ఈ కేంద్రాలకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవచ్చు. జిల్లాలో మొత్తం 23 మామిడి సేకరణ కేంద్రాలు మంజూరయ్యాయి. ఏప్రిల్ చివరికి మొత్తం నిర్మాణాలు పూర్తవుతాయి. జిల్లాలో ఎవరైన గ్రూప్‌గా ఏర్పాడి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం.

– ఏవీఎస్‌వీ జమదగ్ని, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

ఎంతో ప్రయోజనం



మామిడి సేకరణ కేంద్రాలు మామిడి రైతులకు ఎంతో ప్రయోజనం. గతంలో చిన్న చిన్న పాకల్లో మామిడిని ఉంచే వారం. ప్రస్తుతం ఈ కలెక్షన్ సెంటర్‌లో పండించిన పంటను ఉంచి విక్రయాలు చేసుకునే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఈ నిర్మాణానికి అత్యధికంగా 75శాతం రాయితీ అందిస్తుంది. జామి మండలం లొట్టపల్లిలో సెంటర్‌కు విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన రైతులు పండించిన మామిడి పంటలను తీసుకువస్తారు.

– లగుడు దేముడు, మామిడి ఉత్పత్తుల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

బొబ్బిలి రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఆస్మాఫర్హీన్ సూచించారు. మండలంలోని గోకుల్ విద్యాసంస్థలలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాలవ్యతిరేక అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, జీవితం నాశనమ వుతాయని, కుటుంబసభ్యులు దూరమవుతారని, అలాగే మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, తరలించడం, వాడడం చట్టరీత్యా నేరమని, వాటిపై ప్రభుత్వం కఠినచర్యలు చేపడుతుందని వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నా,కలిగి ఉన్నా, తరలిస్తున్నా టోల్‌ఫ్రీనంబర్14500కు ఫోన్ చేసి తమకు తెలియజేయాలని సూచించారు. ఈ సదస్సులో గోకుల్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హేమలత, సిబ్బందితో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

కొత్తవలస: పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై బొడ్డు దేవి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17వ తేదీన మండలంలోని ఓ గ్రామంలో మైనర్‌లపై దెందేరు గ్రామానికి చెందిన బొబ్బిలి రాజేష్, దాలిబోయిన ఎర్నాయుడులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు 17వ తేదీన కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈ కేసు విచారణ కోసం నిందితులను కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. దీంతో ఎస్.కోట సబ్ జైలు నిందితులను తరలించారు.

బాలిక మృతి కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

బొండపల్లి: నిర్లక్ష్యంగా లారీని నడిపి బాలిక మృతికి కారణమైన ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్ష తో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జిల్లా కేంద్రంలోని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కోర్టు న్యాయమూర్తి షేక్ సికిందర్ బాషా గురువారం తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఎస్సై రవి తెలిపిన వివరాలిలా ఉ న్నాయి. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన చలప తి దుర్గాప్రసాద్ 2017వ సంవత్సరంలో లారీ నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వస్తూ నెలివాడ జంక్షన్ వద్ద జాతీ య రహదారిపై బాలికను ఢీకొనడంతో మృ తి చెందింది.

క్లుప్తంగా

డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం



ముల్లి దిలీప్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు

మెళియాపుట్టి: పెద్దపద్మాపురం గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ముల్లి దిలీప్ ఆధార్ అప్‌డేషన్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో తోటి సిబ్బంది, ప్రజాప్రతినిధులు గురువారం సత్కరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల 21, 22వ తేదీల్లో ప్రత్యేక ఆధార్ డ్రైవ్ నిర్వహించారు. పెద్దపద్మాపురం సచివాలయంలో 165 మందికి ఆధార్ నవీరించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సత్కార సభలో సర్పంచ్ మాలతి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఉర్లాన హంసమ్మ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా, త్వరితగతిన సేవలు అందుతున్నాయని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో మొదటిస్థానం దక్కడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అప్పారావు, వీఆర్‌వో శామ్యూల్, శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు లింగాల సంజీవరావు, బైపోతు తేజారావు, రామచంద్ర మజ్జి పాల్గొన్నారు.

'తప్పుడు కేసులు బనాయించడం తగదు'

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు బనాయించడం దారుణమని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలోకి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తోందని, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను ఉపయోగించి తప్పుడు కేసులతో వేధిస్తోందని మండిపడ్డారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వరప్రసాద్

లావేరు: దళారీ వ్యవస్థను నిర్మూలించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కె.వరప్రసాద్ అన్నారు. బెజ్జిపురంలోని వైసీబీ వివేకానంద సదన్ వద్ద గురువారం గోగు కిరణాలు ఎఫ్‌పీవో, గ్రామసిరి ఎఫ్‌పీవోల చైర్మన్లు, డైరెక్టర్లు, సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీవోల ద్వారా గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టడం చేయాలన్నారు. గోగు కిరణాలు వాటాదారులను 1150 మంది నుంచి 1500 వరకూ పెంచాలని, టర్నోవర్ రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచాలన్నారు.

ఆపితే.. ఆపదే!



కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో అవగాహన కలిగిస్తున్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది

- మందుల వాడకాన్ని సగంలోనే మానేస్తున్న క్షయరోగులు
- ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న వైనం
- ప్రత్యేక ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- జిల్లాలో తగ్గుతున్న టీబీ కేసులు
- నేడు ప్రపంచ క్షయ(టీబీ) దినం

నరసన్నపేట: ఎడతెరిపినివ్వని దగ్గు.. ఆకలి మందగించడం..ఛాతినొప్పి..విపరీతమైన అలసట..ఇవన్నీ క్షయ(టీబీ) లక్షణాలే. ఈ వ్యాధి బారిన పడిన వారు వైద్యుల సూచనలు పాటిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న మందులు క్రమం తప్పకుండా వినియోగిస్తే వ్యాధి నుంచి సులువుగానే బయటపడవచ్చు. అయితే చాలామంది మందులు సగంలోనే మానేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా ప్రాణానికి ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.


క్షయ కారణాలివే..

క్షయ అంటు వ్యాధి. ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అయితే కొంత కాలంగా మెదడు, ఎముకలు, మూత్రపిండాలు, పేగులు, చర్మం తదితర అవయవాలు ప్రభావితమై ప్రాణాంతకంగా నిలుస్తోంది. ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యవస్థ దెబ్బతినడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు వాడి పోషక విలువతో కూడిన ఆహారం తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, కిడ్నీ, హెచ్‌ఐవీ-ఎయిడ్స్ బాధితులు, పోషకాహారం లోపంతో ఉన్నవారు, సిలికోసిస్ వ్యాధి కలిగి ఉన్న వారు, ఆర్థరైటీస్, సోరియాసిస్ బాధితులు ఎక్కువగా వ్యాధి బారిన పడే అవకాశముంది. క్షయ రోగులు ఎక్కువగా వెలుతురు ఉన్న గదుల్లో ఉండాలి. రోగికి వీలైనంత ఎక్కువ దూరంలో ఉండటం శ్రేయస్కరం. నిత్యం మాస్క్ వాడేలా చూడాలి. పుట్టిన బిడ్డకు ఇరవై ఒక్క రోజుల్లోగా టీబీ టీకా వేయించాలి.

ఉచితంగా మందులు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చు. మాంటెక్స్ అనే చర్మ పరీక్ష ద్వారా గానీ, ఛాతికి ఎక్స్‌రే తీసి గానీ, రోగి నోటి నుంచి ఉదయం తీసిన కఫాన్ని పరీక్ష చేయడం ద్వారా గానీ వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేస్తుంది.

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు
2019	4383
2020	2405
2021	3446
2022	3320
2023	560



మందులు క్రమం తప్పకుండా వాడాలి..

జిల్లాలో క్షయ వ్యాధిని అదుపు చేయడానికి ప్రయతిస్తున్నాం. రోగులు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలి. చాలా మంది పూర్తి కోర్సు వాడటం లేదు. కొన్నాళ్లు వాడి మానేస్తున్నారు. ఇటువంటి వారి వల్లే వ్యాధి వ్యాపిస్తుంది. మందులు వాడేందుకు ఆయా గ్రామాల్లో ఆశ వర్కర్, ఏఎన్ఎంకు ట్రాకింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నాం. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి బయట పడవచ్చు.

– ఎస్.అనూరాధ, క్షయ నివారణ అధికారి, శ్రీకాకుళం

ప్రత్యేక ట్రాకింగ్ సిస్టం ద్వారా వారికి మందుల సరఫరా, వాటి వినియోగాన్ని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. రోగులకు రెండు కేటగిరీల ద్వారా చికిత్స ప్రభుత్వం అందిస్తుంది. క్షయ రోగులకు పౌష్టికాహార ఖర్చుల కోసం నెలకు రూ.700 చొప్పున ఆరు నెలలు చెల్లిస్తున్నారు.

జిల్లాకు వరుస అవార్డులు

క్షయ వ్యాధి రోగుల శాతాన్ని 20 శాతం మేరకు తగ్గించినందుకు 2021, 2022 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి శ్రీకాకుళం జిల్లాకు వరుసగా రెండు కాంస్య పతకాలు వచ్చాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్షయ నివారణ సంస్థ సిబ్బంది పనిచేస్తున్నారు.

క్షయ నివారణకు అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న మీనాక్షి, అనూరాధ

అరసవల్లి: జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.అనూరాధ కోరారు. ప్రపంచ క్షయ నివారణ దినం నేపథ్యంలో గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్షయ వ్యాధి పట్ల మరింత అవగాహన కల్పించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్షయవ్యాధి అంటు వ్యాధి అని, మైక్రోబ్యాక్టీరియా ట్యూబర్‌క్లోసిస్ అనే సూక్ష్మజీవి ద్వారా సంక్రమిస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గటం, కఫంలో రక్తం పడటం, ఛాతి నొప్పి, సాయంకాల జ్వరం, రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడం తదితర లక్షణాలు ఉంటాయని వివరించారు. గతేడాది 3260 క్షయ కేసులు జిల్లాలో నమోదయ్యాయని, వీటిలో 74 వరకు మొండి క్షయ కేసులున్నాయని, వీటిని నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడితే రోగాన్ని జయించవచ్చునన్నారు. మధుమేహం, క్యాన్సర్, స్టెరాయిడ్స్ వినియోగించే రోగులు, మందు సేవించిన వారికి క్షయ వచ్చే అవకాశముందన్నారు. జిల్లాలో అన్ని సీహెచ్‌సీల్లోనూ క్షయ నిర్థారణ పరీక్షలకు తగిన సౌకర్యాలున్నాయని, మొత్తం జిల్లాలో 12 క్షయ నివారణ యూనిట్లు, 31 కఫం పరీక్ష కేంద్రాలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి క్షయ రోగికి నెలకు రూ.500, ఇతర సంస్థల తరఫున రూ.700 వరకు అందిస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చి క్షయరోగుల సంక్షేమం,, నివారణ చర్యల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఆ స్థలమే.. రంగస్థలం




దేవుడికి వెలి నాటిక దృశ్యం(ఫైల్)

- 25 నుంచి శ్రీకాకుళంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటికపోటీలు
- తొమ్మిదేళ్లుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్న సుమిత్ర కళా సమితి

శ్రీకాకుళం కల్చరల్: అక్కడ పాత్రలకు ప్రాణప్రతిష్ట జరుగుతుంది. అచ్చోట మాట మంత్రంగా మార్పు చెందుతుంది. అనంత జీవితం అణువంత సన్నివేశంలో అర్థమవుతుంది. చప్పట్ల చప్పుడు కళాకారుడి ఆకలి తీరుస్తుంది. ఆ అపురూపమైన స్థలమే.. రంగస్థలం. జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు జరగనున్నాయి. 2014 నుంచి ఈ నాటిక పోటీలు అప్రతిహతంగా జరుగుతూనే ఉన్నాయి. సినిమాల ప్రభావం పెరిగి రంగస్థలం ఊపు తగ్గాక.. నాటిక ప్రదర్శనలు బాగా తగ్గిపోయాయి. అక్కడక్కడా దాతల సాయంతో పోటీలు జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలో శ్రీకాకుళంలోని సుమిత్రా కళాసమితి సభ్యులు 2014 నుంచి నాటిక పోటీలు నిర్వహించడానికి పూనుకున్నారు. వాస్తవానికి ఒక్క నాటక కళకే కాకుండా అన్నింటికీ ప్రోత్సాహం ఇచ్చేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఏటా రంగస్థల నాటక దినోత్సవం సందర్భంగా మూడురోజుల పాటు ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ఒక ప్రముఖ కళాకారుని జ్ఞాపకార్థం పోటీలను నిర్వహిస్తోంది. మొదటిసారి ఇప్పిలిభాస్కరరావు (బాలయ్య) నాటిక పోటీలు 2014లో నిర్వహించారు. అలాగే 2015లో మెట్ట అప్పారావునాయుడు స్మారక పోటీలు నిర్వహించారు. 2016 ఎంఎస్ఎస్ పరబ్రహ్మం స్మారక పోటీలు నిర్వహించారు. 2017లో బహుభాషా నాటిక పోటీలను నిర్వహించారు. హిందీ,తెలుగు, బెంగాలి, ఉర్దూ, పంజాబీ, ఒడిశా, తమిళం, కన్నడం భాషలలో నాటిక పోటీలను 5రోజుల పాటు నిర్వహించారు. 2018 సినీ నటి, నాటక కళాకారిణి ముద్దాడ దమయంతి పేరుతో నాటిక పోటీలు జరిగాయి. 2019లో ప్రముఖ గజల్ కళాకారుడు ప్రధాన ఆదినారాయణ జ్ఞాపకార్థం నాటిక పోటీలు నిర్వహించారు. 2022లో సుమిత్రా కళా సమితి పేరుతో నిర్వహించారు. అలాగే 2023లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఏటా ఒక రంగస్థల నటుడిని పిలిచి సత్కరిస్తున్నారు. 2015లో సురభి సంస్థ సభ్యులను తీసుకొచ్చి వారం రోజులు పౌరాణిక ప్రదర్శనలు ఇప్పించారు.

అన్ని కళలకు ప్రోత్సాహం



అన్ని కళలను ప్రోత్సహించడమే మా ఉద్దేశం. అలాగే కళాకారులకు సాయం అందించడం చేస్తున్నాం. ఇటీవల కరోనా సమయంలో కళాకారులకు బియ్యం, కూరలు, డబ్బులు కూడా ఇచ్చాం. నాటక కళను కూడా బతికించడం కోసం మేము కృషి చేస్తున్నాం. మా కృషికి ఎంతోమంది దాతల సహకారం కూడా ఉంది.

– ఇప్పిలి శంకరశర్మ, సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు

ప్రదర్శనలివే..

సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో అరసవల్లి ఇంద్రపుష్కరిణి వద్దగల వైజయంతి మండపంలో నాటిక పోటీలు జరగనున్నాయి. 25న సభా కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుంది. మొదటిగా గుంటూరుకు చెందిన సద్గురు కళా నిలయం వారి 'కమనీయం' నాటిక, చిలకలూరిపేటకు చెందిన ఎమెచ్యూర్ డ్రెమెటిక్ అసోషియేషన్ వారి 'అక్క అలుగుడు-చెల్లి సణుగుడు' నాటిక, 26న సాయంత్రం 6 గంటలకు గుంటూరు, అభినయ ఆర్ట్స్ 'అతీతం' నాటిక, 7.15గంటలకు హైదరాబాదు, భూమిక థియేటర్ గ్రూప్ ప్రెజెంట్ వారి 'బరిబత్తుల రాజు'నాటిక, 8.30గంటలకు చిలకలూరిపేట, శ్రీమద్దుకూరి ఆర్ట్స్ క్రియోషన్స్ వారి 'మృత్యుపత్రం' నాటిక, 27న సాయంత్రం 6గంటలకు బొరివంక,శర్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారి 'కొత్తపరిమళం' నాటిక, 7.30గంటలకు విశాఖపట్నం, నటరాజ్ ఆర్ట్స్ వా 'ది లాస్ట్ జడ్జిమెంట్' నాటిక ప్రదర్శన జరుగుతాయి. 8.3 0గంటలకు నృత్య ప్రదర్శన, బహుమతి ప్రధానం ఉంటాయి.

● పచ్చని తోరణం



శ్రీకాకుళం సమీపంలోని కళింగపట్నం ప్రధాన రహదారి రెండు వైపులా పచ్చటి చెట్లతో ఇలా కనువిందు చేస్తోంది. ఈ దారి గుండా ప్రయాణం వాహనదారులకు ఆహ్లాదం పంచుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

న్యాయవిద్యలో 35 మందికి తక్షణ ప్రవేశాలు



లాసెట్ తక్షణ ప్రవేశాల్లో భాగంగా ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ (న్యాయ విద్య) తక్షణ ప్రవేశాలు గురువారం నిర్వహించారు. తక్షణ ప్రవేశాలకు లాసెట్ -22 అర్హత, ప్రభుత్వ రాయితీలు వర్తించకపోయినా అనూహ్య స్పందన లభించింది. 35 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇటీవలే వర్సిటీ న్యాయ కళాశాలకు బీసీఐ గుర్తింపు వచ్చింది. దీంతో ప్రవేశాలు మొదలుపెట్టారు. అలాగే ఎడ్‌సెట్ రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తి కావటంతో వర్సిటీ నిర్వహిస్తున్న స్పెషల్ బీఎడ్ మెంటల్లీ రిటార్డ్‌కు తక్షణ ప్రవేశాలు గురువారం నిర్వహించారు. ప్రవేశాల ప్రక్రియ కోర్సు కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఎడ్‌సెట్ ర్యాంకు ఆధారంగా అర్హత ఉన్న ఐదుగురికి ప్రవేశాలు కల్పించారు. కోర్సులో ఉన్న 30 సీట్లు పూర్తయ్యాయి.

'వీలైనంత త్వరగా రీ సర్వే చేపట్టాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రీసర్వే పనులను త్వరగా చేపట్టాలని భూ పరిపాల న ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను కోరారు. ఆయన గురువారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే పనులపై ఆయా జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫేజ్-1 కింద చేపట్టిన రీ సర్వే అప్‌లోడింగ్ విషయంలో బీఎల్ఆర్ సిస్టంను వినియోగించాలని కోరారు. ఇప్పటి వరకు 924 గ్రామాలు మాత్రమే అప్‌లోడ్ చేశారని, మిగిలిన గ్రామాలను వీలైనంత త్వరగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ 2.0లో నగదుతో సంబంధం లేకుండా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రోన్ పద్ధతిలో బీఎల్ఆర్‌ని పూర్తి చేస్తున్నామని, రీ సర్వే వేగవంతమవుతుందని తెలిపారు. మిగిలిన గ్రామాలను కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశానికి సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఏడో రోజు గురువారం సెట్-3 ప్రశ్న పత్రంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మ్యాథ్స్-1(బి)పేపర్, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1కు పరీక్షలు రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో భాగంగా మొత్తం 27,111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (95.595 శాతం హాజరు) 25,917 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 1194 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి కె.ప్రకాశరావు, ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ సభ్యులు, హైపవర్ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు వేరువేరుగా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ విడుదల చేశారు. బీఏలో 585 మంది పరీక్ష రాయగా, 303 (51.79 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో 3259కి 1605 (49.25 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బీబీఏలో 8 మందికి ఆరుగురు (75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బీసీఏలో ఒకరు పరీక్ష రాయగా, పాస్ కాలేదు. బీకాం కంప్యూటర్స్‌లో 234 మంది రాయగా, 112 (47.86 శాతం) మంది ఉత్తీర్ణ సాధించారు. బీకాం జనరల్‌లో 341 మంది పరీక్ష రాయగా , 198 (58.06 శాతం) ఉత్తీర్ణ సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖా స్తు చేయాలనుకునే విద్యార్థులు 15 రోజుల లోపు చేసుకోవాలని చెప్పారు.

క్రైమ్ కార్నర్

వృద్ధురాలి ఆత్మహత్య

సారవకోట: మండలంలో బద్రి గ్రామానికి చెందిన మొయ్యి శిమ్మప్ప (77) గురువారం సూపర్ వాస్మల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శిమ్మప్ప సూపర్‌వాస్మల్ తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి బుడితి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలి సోదరుడు పంగ జోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం



గార: కళింగపట్నం సచివాలయం ఎదురుగా బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళింగపట్నం పంచాయతీ సిలగాం కాలనీకి చెందిన గేదెల శ్రీను (36) కళింగపట్నం నుంచి ఇంటికి బైక్‌పై వస్తుండగా, సచివాలయం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టా రు. తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. శ్రీనుకు ఇద్దరు కుమారులున్నారు. ఎస్ఐ ఎం.మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస పశువుల సంత వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. జలుమూరు మండలం పెద్దదూగాం, చిన్నదూగాం, రావిపాడు గ్రామాలకు చెందిన దుంగ ఆదినారాయణ, మూకళ్ల లక్ష్మీనారాయణ, కింజరావు శ్రీను కలిపి బైక్‌పై సంతకు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీనారాయణ కాలు విరిగిపోగా చికిత్సనిమిత్తం శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మిగిలిన ఇద్దరినీ నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

ఇటుకలు కాల్చుతుండగా దంపతులకు గాయాలు



టెక్కలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణ

మెళియాపుట్టి: ఇంటి కోసం ఇటుకలు తయారు చేస్తుండగా జరిగిన అగ్ని ప్రమాదంలో గిరిజన దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపల్లి పంచాయతీ చందనగిరి గ్రామానికి చెందిన భార్యాభర్తలు కేదారి ఆదినారాయణ, సుశీల గృహ నిర్మాణం కోసం ఇటీవల ఇటుకల నిర్మాణం చేపట్టారు. వర్షాలకు వాటిని కాల్చకుండా పరదాలతో కప్పి ఉంచారు. గురువారం మధ్యాహ్నం ఇటుక బట్టీని కాల్చడానికి వెళ్లారు. కొంచెం చెమ్మగా ఉందని పెట్రోల్‌పోసి నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కాళ్లు చేతులు కాలిపోయి గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి: మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జలకలింగుపురం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. టెక్కలి గ్రామానికి చెందిన నరసింహమూర్తి ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వెళ్తూ.. జలకలింగుపురం వద్ద బహిర్భూమికి నడిచి వెళ్తున్న అదే గ్రామానికి చెందిన సవరయ్యను అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడటంతో స్థానికులు 108 ద్వారా టెక్కలి ఆసుపత్రికి తరలించారు.

కందిరీగల దాడిలో 25 మందికి గాయాలు



ఉపాధి వేతనదారులను పరామర్శిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలి పంచాయతీ పరిధిలో కిల్లివానిచెరువులో గురువారం ఉపాధి పనులు చేస్తున్న 25 మంది వేతనదారులపై కందిరీగలు దాడిచేసి గాయపరిచాయి. పనులు నిర్వహిస్తుండగా చెరువు సమీపంలోని ముళ్లపొదల్లో కందిరీగలు ఒక్కసారిగా దాడిచేసి తల,శరీరంపైనా కుట్టడంతో వేతనదారులు రక్షించుకునేందుకు పరుగులుతీశారు. ఈ ఘటనలో వై.దాలయ్య, హెచ్.రాజారావు, కె.రేవతి, అల్లబోయిన నాగమణి, కవిటి లక్ష్మి, కూన ఢిల్లేశ్వరరావు, ఆర్.రమణమూర్తి, ఎస్.అచ్చెయ్య, కె.నీలాచలం తదితరులను బలంగా కుట్టడంతో బొబ్బర్లువచ్చాయి. వెంటనే వీరిని ఫీల్డ్ అసిస్టెంట్ కవిటి అరుణకుమారి చికిత్స నిమిత్తం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఏపీఓ అరుణ్‌కుమార్ బాధితులను పరామర్శించారు.

కళింగపట్నంలో విషాదఛాయలు

గార: కళింగపట్నానికి చెందిన ఇద్దరు యువకులు విశాఖపట్నం వెళ్తుండగా ఆనందపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పట్నాన సంతోష్ హార్డువేర్ దుకాణం నడుపుతుండగా, లాడే దుర్గాప్రసాద్ హిందుస్థాన్ పరిశ్రమ సేల్స్ అధికారిగా పనిచేస్తున్నారు. ఇద్దరూ ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విశాఖపట్నం కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం రెండు మృతదేహాలు గురువారం సాయంత్రం కళింగపట్నం చేరుకున్నాయి.

కేజీబీవీలు పిలుస్తున్నాయ్!

- కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 20 వరకు అవకాశం
- 30 మండలాల పరిధిలో 26 కేజీబీవీల్లో 1040 సీట్లు భర్తీ



కేజీబీవీ సారవకోట

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాలకు వేళయింది. 2022-23 విద్యా సంవత్సరానికిగాను కేజీబీవీల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈనెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హులైన బాలికలు 6వ తరగతిలో ప్రవేశాలు పొందవచ్చు.

26 కేజీబీవీలు.. 1040 సీట్లు

పునర్విభజన అనంతరం 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో 26 కేజీబీవీలు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన సాగే ఈ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 1040 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేస్తారు. పేద, అనాథ పిల్లలతో పాటు బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసినవారు), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే అర్హులు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన బాలికలై ఉండాలి. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీ://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్// వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పూర్తిచేయాల్సి ఉంటుంది. కేజీబీవీల్లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. 2018 నుంచి ఇంటర్మీడియెట్ కోర్సులను కూడా అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 21 కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని కేజీబీవీల్లోను వివిధ ఇంటర్ కోర్సులను ప్రవేశపెట్టారు. విద్యాలయాల్లో పూర్తిస్థాయి భద్రత ఉంటుంది. ఉపాధ్యాయులు (టీజీటీ/ పీజీటీలు) సైతం మహిళలే. రూపాయి ఖర్చు లేకుండా అత్యుత్తమ బోధన, నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలతో కేజీబీవీల్లో సీట్లకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది.

సద్వినియోగం చేసుకోండి



కేజీబీవీల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఇందులో బాలికలు చదువుకోవడం గొప్ప అవకాశం. ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్ర శిక్ష అదనపు జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ)

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

కేజీబీవీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమయంలో ఏర్పడిన సందేహాలు, సమస్యల నివృత్తి కోసం అధికారులు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫోన్ నంబర్ 89192 61518ను సంప్రదించవచ్చని ఏపీసీ జయప్రకాష్ చెబుతున్నారు.